## ముసాయిదా కమిటీ



రాజ్యాంగ రచన కోసం డ్రాఫ్టింగ్ (ముసాయిదా) కమిటీని రాజ్యాంగ సభ నియమించింది. ముసాయిదా కమిటీలో అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో కలుపుకొని మొత్తం ఏడుగురు సభ్యులు ఉన్నారు. వారు... అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్. గోపాలస్వామి అయ్యంగార్, కేఎం మున్షి, సయ్యద్ మహ్మద్ సాదుల్లా, బీఎల్ మిత్తర్, డీపీ ఖేతాన్. తర్వాత బీఎల్ మిత్తర్ స్థానంలో మాధవ రావును సభ్యుడిగా నియమించారు. రాజ్యాంగ సభ సలహాదారుడు బీఎన్ రావు సహాయంతో రూపొందించిన ప్రతిని 1947 అక్టోబర్ చివరికల్లా డ్రాఫ్టింగ్ కమిటీ క్షుణ్నంగా పరిశీలించడం మొదలుపెట్టింది. ముసాయిదా కమిటీ రూపొందించిన చివరి ప్రతి 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదం పొందింది. 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది.

## తెర వెనుక మేధావి

రాజ్యాంగాన్ని పరిశీలించి, ఒక రూపం ఇచ్చింది ముసాయిదా కమిటీయే అయినప్పటికీ, రాజ్యాంగ రచనలో కీలక పాత్ర పోషించింది రాజ్యాంగ సభ సలహాదారుడు బెనెగల్ నరసింగ రావు (బీఎన్ రావు). ఇండియన్ సివిల్ సర్వీస్ మాజీ అధికారి అయిన బీఎన్ రావు ప్రపంచంలోని ముఖ్యమైన రాజ్యాంగాలను అధ్యయనం చేశారు. భారత రాజ్యాగ రచనలో కీలక పాత్ర పోషించారు.




## రాజ్యాంగ సభ ఏర్పాటు



జాతీయ నాయకులు స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనే భారతదేశ పాలనకు ఓ రాజ్యాంగం ఉండాలని బ్రిటిష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బ్రిటిష్ ప్రభుత్వం కూడా వివిధ కమిటీలను, 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని తీసుకువచ్చింది. చివరికి 1946లో లార్డ్ పెథిక్ లారెన్స్ అధ్యక్షుడిగా బ్రిటిష్ ప్రభుత్వం 'క్యాబినెట్ మిషన్'ను భారతదేశానికి పంపించింది. ఇదే భారతదేశ పాలన కోసం ఓ రాజ్యాంగ సభ ఏర్పాటుచేయాలని సూచించింది. ఈమేరకు 1946లోనే రాజ్యాంగ సభ ఏర్పాటైంది. ఇందులో మొత్తం 389 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 292 మందిని బ్రిటిష్ ఇండియాలోని 11 రాష్ట్రాల శాసనసభల సభ్యులు పరోక్ష ఎన్నిక విధానంలో ఎన్నుకున్నారు. మరో 93 మంది సభ్యులు స్వదేశీ సంస్థానాల నుంచి నామినేట్ అయ్యారు. ఇంకో నలుగురు సభ్యులు చీఫ్ కమిషనర్స్ ప్రావిన్సెస్ (ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంతాల వంటివి) నుంచి ప్రాతినిధ్యం వహించారు.

అయితే, 1947 ఆగస్ట్ 14న దేశ విభజన జరిగి పాకిస్థాన్ ప్రత్యేక దేశంగా ఏర్పడింది. దీంతో భారత రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య 299కి తగ్గిపోయింది. వీరిలో 229 మంది బ్రిటిష్ ఇండియాలోని రాష్ట్రాల నుంచి, 70 మంది స్వదేశీ సంస్థానాల నుంచి ప్రాతినిధ్యం వహించారు.

## జనవరి 26నే ఎందుకు?




అది గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న సమయం. 1929 డిసెంబర్ 31 అర్ధరాత్రి కాంగ్రెస్ అధ్యక్షుడిగా జవహర్‌లాల్ నెహ్రూ తొలిసారిగా జాతీయ పతాకం ఎగరవేశారు. అదేరోజున 1930 జనవరి 26ను 'స్వాతంత్ర్య దినోత్సవం'గా జరుపుకోవాలని ప్రకటించారు. నిజానికి మనదేశానికి బ్రిటిష్ వారినుంచి 1947 ఆగస్ట్ 15న స్వాతంత్ర్యం వచ్చింది. అయినప్పటికీ, 1930 నుంచి 1947 వరకు జనవరి 26ను స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుతూ వచ్చారు. ఈ సంఘటనకు గుర్తుగానే భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26 నాటికే పూర్తయినా, 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వస్తుందని రాజ్యాంగ సభ ప్రకటించింది. ఈ రోజు నుంచి భారతదేశం గణతంత్రంగా అవతరించింది. అలా మనదేశంలో ఆగస్ట్ 15, జనవరి 26 జాతీయ దినోత్సవాలుగా నిలిచిపోయాయి. ఇక రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26ను 'భారత రాజ్యాంగ దినోత్సవం'గా జరుపుకోవాలని 2015లో నిర్ణయించారు.